కల్పిక

# "అందుకే కాలం యిలా ఏడ్చింది"

ఇటికాల నీలకంఠరావు

"అందుకే కాలం యిలా యేడ్చింది" అంటాడు సుబ్రహ్మణ్యం. అంటే అంటాడుకాని, సుబ్రహ్మణ్యం వల్లనే, యింకా గ్రహాలు గతులుతప్పడం లేదనీ, సముద్రం చెలియలికట్ట దాటిరావడంలేదనీ, ఆకాశం ఆకాశం స్థానంలో, భూమి భూమిస్థానంలో వుండిపోతున్నాయనీ, అనుకునే వెర్రివాళ్ళెవళ్ళూలేరు. మావూరు వెర్రివాళ్ళది కాదు. చూస్తూచూస్తూ యింత ఘనత, సుబ్రహ్మణ్యానికి యెవరూ కట్టకట్టబెట్టలేరు. ఆ ఘడియే వస్తే ఆ కాస్త ఘనతా దక్కించుకోడానికి మావూరు కొల్లపోలేదు-దండ వచ్చిందంటేవూళ్ళో ఒక్కొక్కరికి రేకేనావోరకదు.

అలాంటప్పుడు సుబ్రహ్మణ్యం "అందుకే కాలం యిలా యేడ్చింది"అనటం యేంబాగుంది. కాలాన్నిగురించి యేడిస్తే సాముదాయికంగా యేడ్వాలి. ఒక్క సుబ్రహ్మణ్యానికే పట్టుకున్న యేడుపుకాదిది. కాలం యిలా యేడ్వడానికి, ఒప్పుకుంటే అందరూ కర్తలే. అప్పుడు సుబ్రహ్మణ్యం తనొక్కణ్ణీ మినహాయించుకొంటే మాత్రం యేం ప్రయోజనం! ఈ ఒక్కడి యేడుపు తక్కువకాకపోయినా కాలం యిలాయేడ్చితీరదే! అందరితో కలిసి, అందరికోరకు యీ ఒక్కడు కూడా యేడ్చితీరాలి.

నే నొప్పుకుంటాను కాలం యేడుస్తున్నదంటే కాలం యేడుస్తుంది. కాలం యేడుస్తున్నది యీ మధ్య. వర్షాలు లేకపోవడం, ఎక్కువ వర్షాలు పడడం, పంటలు పండకపోవడం, యుద్ధమేఘాలు యెడపెడా పొడచూపడం, కరువు కాటకాలు, చోరాగ్ని భయాలు, మారీస్ఫోటకాది జాడ్యాలు, యివి కాలం యేడుపులో కొన్ని బిందువులు. వీటిలో చాలా లక్షణాలు యీమధ్య మనకు తగుల్కుమన్నాయి.

"అందుకే కాలం యిలా యేడ్చింది" అంటాడా సుబ్రహ్మణ్యం? కాలం యేడ్వకండా ఒక్క సుబ్రహ్మణ్యం యెన్నడూ ఆపలేడు. కాలం ఒక మానవుని చెప్పుచేతుల్లో వుండేదికాదు. ఇది అందరికీ తెలుసు. అందరూ కలిసి కాలాన్ని తమ అదుపాజ్ఞల్లో వుంచుకోవచ్చని కొందరికి తెలుసట! ఆ కొందరే నేటికాలంలో కరువైపోయారు. కరువైపోయిన ఆ కొందరిలో సుబ్రహ్మణ్యం తానొకణ్ణంటూ జనసామాన్యంమీద యీ సవారీచేయడం నాకేమీ నచ్చలేదు. అమ్మ పుట్టిల్లు సంగతి మేనమామదగ్గరా పొగడడం! మనుష్యుల ప్రవర్తనకు కాలానికీ ముడిపెట్టిన పెద్దల వాక్యాలను పట్టుకొనేగా వీడిలా అనడం. అయినా వీడేమంత పత్తిత్తని! అనాదినుంచీ యీ విషయాన్ని పెద్దలు బలపరుస్తున్నారే కాని, పొటాసియం సయొనైడ్ తింటే మనిషి చనిపోయేటంత ప్రామాణిక విషయంకాదిది. నమ్మినవారికి చెరుపులేదంటారు. మనుష్యులు మంచి ప్రవర్తనకలవారైతే కాలం బాగుంటుంది, లేకపోతే కాలం యిలాగే ఏడుస్తుందని సుబ్రహ్మణ్యం నమ్మితేనాకేమీ విప్రతిపత్తిలేదు. నమ్మి, వీడుదాని ప్రకారం తన ప్రవర్తనను యేం బాగుచేసుకున్నాడనే నే నాలోచిస్తాను. వీడి నమ్మకను ఆధారం చేసుకునే, వీడి ఒక్కొక్క నడతను తీసుకొని, ఒక్కొక్క వాణ్యమైన కథ వ్రాసి అందుకే కాలం యిలా యేడుస్తున్నదని రుజువు పర్చవచ్చు. కాని నా యీ రచనకు సుబ్రహ్మణ్యం నడవడికి, దాని వివరాలకూ లంకె పెట్టడంలేదు. మొత్తంమీద సుబ్రహ్మణ్యం మంచివాడు కాకపోవడమే నా యీ రచనకు పట్టుగొమ్మ.

మనుష్యులంతా చెడిపోయి దుర్వర్తనులైనారు కాబట్టి కాలం యిలా దుర్భిక్షంగా వుందంటాడు సుబ్రహ్మణ్యం. యీ మనుష్యుల్లో తనను జమకట్టకండా, ఆత్మపరీక్ష లేకండా సుబ్రహ్మణ్యం తనకు తాను పవిత్రుణ్ణని భావిస్తున్నాడు.'అందుకే కాలం యిలా యేడ్చింది' అనుకుంటాను నేను.